

## పాలమూరు నీళ్లివ్వకుంటే ఉద్యమం

> మొదటిపేజీ తరువాయి...

ప్రాజెక్టు ద్వారా నీళ్లు వచ్చే పరిస్థితి లేదని మీడియాలో దుష్ప్రచారం జరగడం ఆందోళన కలిగిస్తున్నదని వాపోయారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రాగానే ఈ ప్రాజెక్టు ద్వారా 12 లక్షల ఎకరాలకు నీళ్లిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఏపీ సర్కారు ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసినా, కేంద్రం డీపీఆర్‌ను వెనక్కి తీసుకున్నా ఎందుకు పట్టించుకోవడంలేదని నిలదీశారు. శ్రీశైలం ప్రాజెక్టుపై పెత్తనం చలాయించి నీళ్లను తరలించుకుపోయేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఇస్తామని చెప్పిన ప్రధాని మోదీ ఇప్పుడు ఆ ఊసే ఎత్తకపోవడం విడ్డూరమన్నారు. ఇంత అన్యాయం జరుగుతున్నా ఇదే జిల్లాకు చెందిన సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. ప్రాజెక్టును పూర్తిచేస్తే ఉమ్మడి మహబూబ్‌నగర్ సస్యశ్యామలమవుతుందని, సీఎంకు చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని, ఏపీ ప్రభుత్వంతో చర్చించాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యాచరణ ప్రకటిస్తామని తేల్చిచెప్పారు.

## టీబీ డ్యాం నీటి విడుదల

**10 రోజులపాటు ఆర్డీఎస్‌కు 1.078 టీఎంసీలు**

అయిజ, డిసెంబర్ 27 : కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం నుంచి ఆర్డీఎస్ ఆనకట్టకు అధికారులు నీటిని విడుదల చేశారు. ఆర్డీఎస్ పరిధిలో యాసంగి పంటలకు నీటి లభ్యత తగ్గడంతో 2024-25 ఏడాదికి ఆర్డీఎస్‌కు 5.896 టీఎంసీల నీటి వాటా కేటాయించారు. తెలంగాణ జలవనరుల శాఖ టీబీ బోర్డు కార్యదర్శి నాగమోహన్‌కు ఇండెంట్ పెట్టారు. దీంతో ప్రాజెక్టు స్లూయిస్ నుంచి నీరు విడుదల చేశారు. రోజూ 1500 క్యూసెక్కుల మేర 10 రోజులు 1.078 టీఎంసీలు విడుదల చేయనున్నారు. శనివారం నాటికి ఆనకట్టకు నీరు చేరే అవకాశం ఉన్నదని ఆర్డీఎస్ ఈఈ శ్రీనివాస్ తెలిపారు.

# 3న బీసీల భారీ బహిరంగసభ

**రిజర్వేషన్లు పెంచకుంటే ఎన్నికలను అడ్డుకుంటం**

- బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి
- డెడికేటెడ్ కమిషన్ నివేదిక ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
- తెలంగాణలో 50% పైగా బీసీలుంటే 42% రిజర్వేషన్లని ఎలా చెప్పిండ్రు?
- ఇప్పుడు 42% ఇవ్వకుండా ఎన్నికలా?
- బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



బంజారాహిల్స్‌లోని నివాసంలో బీసీ సంఘాలతో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, చిత్రంలో బీసీ సంఘాల నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): బీసీ రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని చూస్తే అడుగడుగునా అడ్డకుంటామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని ఆమె నివాసంలో బీసీ సంఘాలతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పెంపుపై స్పష్టత ఇవ్వకుండా ఎన్నికలు జరపాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయని చెప్పారు. డెడికేటెడ్ కమిషన్ నివేదిక వచ్చిన తర్వాతనే ప్రభుత్వం ప్రకటించినట్టు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో సగానికి పైగా బీసీ జనాభా ఉంటే కేవలం 42 శాతం రిజర్వేషన్లు ఏ ప్రాతిపదికన కల్పిస్తారని ప్రశ్నించారు. ఇప్పుడు అవి కూడా ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహించాలని చూస్తున్నారని విమర్శించారు. రిజర్వేషన్లు పెంచకుంటే నిరసన ప్రదర్శనలు చేపడతామని స్పష్టంచేశారు.

**మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ఇప్పుడు ఇచ్చిన హామీల ఊసెత్తడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణమైన బీసీలను ఆ పార్టీ మోసం చేస్తున్నది. బడ్జెట్‌లో ఏటా బీసీల అభివృద్ధికి రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కింది. - ఎమ్మెల్సీ కవిత**

### బీసీలకు మద్దతుగా బహిరంగ సభ

సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా అన్ని బీసీ సంఘాలతో జనవరి 3న భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు. సభకు రాష్ట్రంలోని అన్ని బీసీ ఉపకులాల వారు హాజరవుతారని చెప్పారు. ఇందిరా పార్కు సభ ద్వారా బీసీల బలమేంటో చూపిస్తామని స్పష్టం చేశారు. బీసీ సంఘాలతో శుక్రవారం నిర్వహించిన సమావేశం

**తెలంగాణ జనాభాలో సగానికి పైగా బీసీలుంటే.. కేవలం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తమని ఏ ప్రాతిపదికన ప్రకటించిండ్రు? కాంగ్రెస్ చెప్పిన 42 శాతం రిజర్వేషన్లు కూడా ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహించాలని చూస్తున్నరు. బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం రిజర్వేషన్లు పెంచకుంటే జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేపడుతం. - ఎమ్మెల్సీ కవిత**

కేవలం ట్రైలర్ మాత్రమేనని, జనవరి 3న అసలైన సినిమా చూపిస్తామని వెల్లడించారు. ఈ సభ ద్వారా ప్రభుత్వానికి బీసీల సత్తా చూపించబోతున్నామని చెప్పారు. సమావేశానికి 40కి పైగా బీసీ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

### కేసీఆర్ అమలు చేసిన పథకాలను కొనసాగించాలి

కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేసిన యాదవులకు గొర్రెల పంపిణీ పథకాన్ని కొనసాగించాలని కవిత డిమాండ్ చేశారు. నాయీ బ్రాహ్మణులు, రజకులు, మేర కులస్థుల దుకాణాలకు కేసీఆర్ హయాంలో ఉచిత విద్యుత్తు అందించారని, కాంగ్రెస్ రాగానే దాన్ని నిలిపివేయడంతో వారికి ఆర్థిక భారం పడిందని చెప్పారు. వెంటనే ఉచిత విద్యుత్తుతను పునరుద్ధరించాలని, అన్ని బీసీ ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి భవనాలు నిర్మించాలని, ఉచిత చేప పిల్లల పంపిణీని తిరిగి ప్రారంభించి, కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ముదిరాజ్ కులాన్ని బీసీ ఏలో చేర్చాలని డిమాండ్ చేశారు. బీసీ కులాల్లోని సంచార జాతులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేయాలని, సబ్సిడీలతో రుణాలు మంజూరు చేయాలన్నారు. బీసీ సబ్‌ప్లాన్‌ను అమలు చేసి యువతకు ఉపాధి కల్పించాలని, జ్యోతి రావు పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ మాదిరిగానే బీసీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకొచ్చి వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయినం

**పింఛన్లు పెంచుతమంటేనే ఓట్లేసినం • మాజీ మంత్రి ఎర్రబెల్లితో పింఛన్‌దారులు**

దేవరుప్పుల, డిసెంబర్ 27 : 'పింఛన్ పెంచుతమంటే కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసినం సారూ.. రేవంత్‌రెడ్డి మాటలు విని మోసపోయినం.. ఏడాదైంది..గదే రెండు వేలు.. అదే మూడు వేలు.. ఇగ పెంచుతడన్న ఆశ చాలిచ్చుకున్నం.. ఒక్కశిత్తం చేసుకున్నం సారూ.. కేసీఆరే మంచిగుండె.. ఊర్లు బాగుపడ్డయ్. అడుగక ముందే ఇంటింటికీ నీళ్లిచ్చిండు.. చెరువులు నింపిండు.. రైతుబంధు ఇచ్చిండు... అన్ని సౌలతులు చేసిండు.. అంతా ఆగమైయింది సారూ'.. అంటూ పలువురు పింఛన్‌దారులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎదుట మొరపెట్టుకున్నారు. శుక్రవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సీతారాపురం దారిలో పోతున్న ఎర్రబెల్లికి ఆ ఊరిలో ఫించనుదారులు తారసపడగా, వారి మధ్య జరిగిన సంభాషణ ఇది. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. దేశంలోనే మొట్టమొదటిసారి వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలపై సానుభూతి చూపి, వృద్ధులు, ఒంటరి మహిళలకు రూ.2వేలు, దివ్యాంగులకు రూ.3 వేలు ఇస్తేనే, వారంతా సమాజంలో గౌరవంగా బతుకుతారనే ఉద్దేశంతో తెలంగాణ మొదటి ముఖ్యమంత్రిగా కేసీఆర్ పింఛన్లు పెంచినట్టు తెలిపారు. 'మాయమాటలు నమ్మి ఆయనను ఓడగొట్టిండ్రు. ఇక నేను ఎంత అభివృద్ధి చేసినా అది జనం పట్టించుకోలే.. కేవలం రేవంత్‌రెడ్డి మాటలు.. ఆరు గ్యారెంటీలు మీ చెవుల్లో ఊదరగొడితే ఓట్లు గుద్దిండ్రు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ అబద్ధపు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చి ఏడాదైంది. ఏ ఒక్కటీ అమలు కాలే.. జనం చెవిలో పువ్వులు పెట్టి గెలిచిన రేవంత్‌రెడ్డికి సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనం నిలదీస్తారు. పింఛనుదారులతో పాలకుర్తి నియోజకవర్గ స్థాయిలో భారీఎత్తున ధర్నా చేయాల్సిన సమయం వచ్చింది' అని ఎర్రబెల్లి పిలుపునిచ్చారు. మరోవైపు రైతు భరోసా అమలులేదని, దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతపై ఈ ప్రభుత్వానికి ద్వేషమెందుకని ప్రశ్నించారు. 'రైతు భరోసాను ఐదెకరాలకే ఇస్తాం.. ఏడెకరాలకే అందిస్తాం' అంటూ చెప్పడం ఎంత వరకు కరెక్ట్ అని నిలదీశారు. ఎకరాలను పక్కన బెట్టి, తనకున్న భూమిని సాగు చేస్తున్న రైతులకు ఇచ్చినమాట మేర రూ.15వేలు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. గ్యారెంటీలు అమలు చేసేవరకు నిలదీస్తూనే ఉంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సీతారాంపురంలో పింఛన్‌దారులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



# కాంగ్రెస్ నిర్లక్ష్యం.. 'పాలమూరు'కు శాపం!

- అనుమతుల సాధనలో వైఫల్యం
- ఏడాది పాలనలో తీవ్రనిర్లక్ష్యం
- వాదనల సమర్పణలో వైఫల్యం
- డీపీఆర్ వెనక్కి పంపడంతో మొదటికొచ్చిన పరిస్థితి

హైదరాబాద్, డిసెంబర్27 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు శాపంగా మారింది. రేవంత్‌రెడ్డి సర్కారు అలసత్వం వల్లే ప్రాజెక్టుకు అనుమతుల రాలేదని, డీపీఆర్‌నును సీడబ్ల్యూసీ తిప్పిపంపిందని విమర్శలు వినిపిస్తున్నాయి. సీడబ్ల్యూసీ కోరిన సమాచారాన్ని ప్రభుత్వం సకాలంలో ఇవ్వకపోవడంతోనే డీపీఆర్‌ను తిరస్కరిస్తున్నట్టు కేంద్రం స్పష్టంచేయడం ఇందుకు నిదర్శనమని నిపుణులు చెబుతున్నారు.

### పదేండ్ల కృషిని పాతరేసిన కాంగ్రెస్

ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని 12.30లక్షల ఎకరాల సాగు నీరు, తాగు నీటిని అందించే లక్ష్యంతో 2015లో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నాడు కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూ.35వేల కోట్ల అంచనా వ్యయంతో మొదటిదశలో తాగునీటి పనులను, రెండో దశలో సాగునీటి పనులను పూర్తి చేయాలని భావించింది. ప్రాజెక్టుకు ఏపీ సర్కారు, తెలంగాణలోని ప్రతిపక్షం మోకాలడ్డాయి. ఎన్జీటీ, సుప్రీంకోర్టు, ట్రిబ్యునల్, జోనల్ కౌన్సిల్‌లో కేసులు వేస్తూ ఆటంకాలు సృష్టించారు. కేసీఆర్ ప్రభుత్వం మొక్కవోని దీక్షతో అడ్డంగులను అధిగమించింది. 90టీఎంసీల నికర జలాలను పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు కేటాయించింది. డీపీఆర్‌ను సిద్ధం చేసి 2022 సెప్టెంబర్‌లో సీడబ్ల్యూసీకి సమర్పించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను కేంద్ర పర్యావరణ, అటవీశాఖ పరిధిలోని ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ(ఈఏసీ) పలుసార్లు ప్రతిపాదనలను పక్కనపెట్టింది. కరువు ప్రాంత పరిస్థితిని తెలంగాణ ప్రభుత్వం ఈఏసీకి వివరించగా ఎట్టకేలకు ఈఏసీ ఒప్పుకుంది. అనుమతుల మంజూరుకు కేంద్రానికి సిఫారసు చేసింది. కానీ ఏడాది కాలంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని అనుమతులు అడగలేదు.

### డీపీఆర్‌ను వెనక్కి పంపిన సీడబ్ల్యూసీ


పాలమూరు ప్రాజెక్టు డీపీఆర్‌ను అప్రైజల్ లిస్ట్ నుంచి తొలగిస్తున్నామని సీడబ్ల్యూసీ ఇటీవల స్పష్టంచేసింది. తెలంగాణ ప్రభుత్వ వైఖరే కారణమంటూ లేఖ రాసింది. 2022 సెప్టెంబర్ 13 నుంచి అప్రైజల్ తమవద్ద పెండింగ్‌లో ఉందని పేర్కొన్నది. మైనర్ ఇరిగేషన్ ద్వారా ఆదా చేసే 45.66 టీఎంసీలను వాడుకుంటామన్న రాష్ట్రప్రభుత్వం ఆ వివరాలు అడిగితే స్పందించలేదని తెలిపింది. ఈ నెల 22న లేఖ రాశామని గుర్తుచేసింది. డీపీఆర్‌ను పరిశీలన జాబితా నుంచి తొలగిస్తున్నట్టు వెల్లడించింది.

### ఏడాదిగా సర్కారు మొద్దునిద్ర!

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లారు. జనవరి 4న కేంద్ర జలశక్తి మంత్రిని కలిసి, పాలమూరు ప్రాజెక్టుకు నిధులివ్వాలని కోరారు. జనవరి 29న కేంద్రం తెలంగాణ సర్కారుకు స్పష్టమైన జవాబు చెప్పింది. ట్రిబ్యునల్ వివాదం వల్ల అనుమతులివ్వలేమని, మరోవిధంగా ఆర్థిక సాయం అందిస్తామని తెలంగాణ సర్కారుకు స్పష్టంగా తేల్చిచెప్పింది. ఓ సామాజికకార్యకర్త ఆర్టీఐ కింద దరఖాస్తు చేయగా కేంద్రమే ఈ మేరకు వెల్లడించింది. నాగర్‌కర్నూల్ చీఫ్ ఇంజినీర్ హమీద్ ఖాన్ మేలో విరమణ పొందారు. ఆయన స్థానంలో సీనియర్ ఇంజినీర్‌ను నియమించి అనుమతుల కోసం కృషి చేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోలేదని ఇంజినీర్లు మండిపడుతున్నారు. స్థానిక ఎస్ఈకే ఈ బాధ్యతలను అప్పగించింది. వీటితో పాటు మరిన్ని బాధ్యతలు కట్టబెట్టింది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇప్పుడు కీలకమైన ప్రాజెక్టు డీపీఆర్ తిరస్కరణకు గురైందని ఇంజినీరింగ్ నిపుణులు ఆక్షేపిస్తున్నారు.

# పైసలివ్వరు.. పనులు సాగవు

- ఇదీ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిస్థితి
- 25శాతం పనులపైనా నిర్లక్ష్యం
- ఏ, బీ క్యాటగిరీల్లో 18 ప్రాజెక్టులు
- మార్చి నెలాఖరునాటికి పూర్తి చేయాలని లక్ష్యం
- 7,647 కోట్లు అవసరమని అంచనా
- పైసా విదల్చని కాంగ్రెస్ సర్కారు






హైదరాబాద్, డిసెంబర్26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి దయనీయంగా మారింది. దాదాపు 75 శాతం పనులు పూర్తి అయిన ప్రాజెక్టులకు కూడా దిక్కు లేకుండా పోయింది. సంబంధిత శాఖ మంత్రి మాత్రం సమీక్షల మీద సమీక్షలు పెడుతూ, జిల్లాల పర్యటనలు చేస్తూ, ప్రాజెక్టులను సందర్శిస్తూ పనులను పూర్తిచేస్తున్నాం అంటూ హడావుడి చేస్తున్నా ఆచరణలో మాత్రం అడుగుకూడా ముందుకు పడని దుస్థితి నెలకొన్నది. అన్ని ప్రాజెక్టుల్లో భూసేకరణే ప్రధాన సమస్యగా నిలిచిందని తెలిసినా కూడా, అందుకు కావాల్సిన నిధులను మాత్రం సర్కారు విడుదల చేయలేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైంది పరిస్థితి.

### ప్రాధాన్యత కాగితాలకే పరిమితం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పలు సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇప్పటికే 75శాతం మేరకు పనులను పూర్తయిన మొత్తం 18 ప్రాజెక్టులను ఎంపిక చేసింది. వాటిని ఏ, బీ క్యాటగిరీలుగా విభజించింది. ఏ క్యాటగిరీలోని 6 ప్రాజెక్టులను 2025 మార్చి నెలాఖరునాటికి పూర్తిచేయాలని, తద్వారా ఆయా ప్రాజెక్టుల పరిధిలో మిగిలిన 47,882 ఎకరాలకు సాగు నీరందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇక బీ క్యాటగిరీలో మొత్తంగా 12 ప్రాజెక్టులను ఎంపిక చేసింది. మార్చినెలాఖరులోగా ఏ, బీ క్యాటగిరీలోని ప్రాజెక్టుల పరిధిలో 5.84 లక్షల ఎకరాలకు సాగునీరందించాలని నిర్దేశించుకున్నది. ఈ ప్రాజెక్టుల పరిధిలో మిగిలిన 25 శాతం పనుల పూర్తికి రూ.7,647.09 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసింది. బడ్జెట్‌లోనూ ఆ మేరకు నిధులను కేటయించింది. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం ఒక్క పైసాను విదల్చలేదని సాగునీటిశాఖ ఇంజినీర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పనులు ఒక్క అడుగు కూడా ముందుకుపడడడం లేదని వివరిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోసహా, సాగునీటిశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రులు జిల్లాల వారీగా, ప్రాజెక్టులవారీగా సమీక్షల మీద సమీక్షలు చేస్తున్నారే తప్ప ఆచరణలో నిధులను మాత్రం విడుదల చేయడం లేదని విమర్శిస్తున్నారు.

### గుంట భూమి సేకరించలె

ప్రభుత్వం ప్రాధాన్యతగా పెట్టుకున్న 18 ప్రాజెక్టుల్లో కాలువల పనులు పెండింగ్‌లో ఉండడానికి ప్రధాన కారణం భూసేకరణే. కొన్ని చోట్ల రైతులు కేసులు కూడా వేశారని తెలుస్తున్నది. ప్రాధాన్య ప్రాజెక్టుల్లో పెండింగ్ పనులు పూర్తి చేయడానికి దాదాపు 14,696.26 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉన్నదని ఇరిగేషన్‌శాఖ లెక్కలు తెలుపుతున్నాయి. అందుకోసం రూ.2,500కోట్లు అవసరమని అంచనా. భూసేకరణ పూర్తయితేనే పనులు ముందుకు సాగుతాయి. కానీ ప్రభుత్వం ఇప్పటివరకు ఎక్కడా ఒక్క గుంట భూమిని కూడా సేకరించలేదని ఇంజినీర్లు వివరిస్తున్నారు. దీంతో పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారాయని తెలిపారు. ప్రభుత్వం ప్రాధాన్యతగా పెట్టుకున్న ప్రాజెక్టు పనుల పురోగతినే ఇలా ఉంటే ఇంకా పెండింగ్‌లో ఉన్న మేజర్, మీడియం ప్రాజెక్టుల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పనులను పూర్తిచేయాలంటే రాబోయే 6 నెలలే కీలకమని, ఇప్పటికైన ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని, తద్వారా పనులు ముందుకుసాగుతాయని అధికారులు సూచిస్తున్నారు.

**బీ క్యాటగిరీ**

| ప్రాజెక్టు | నిధులు అవసరం (కోట్లలో) | సేకరించాల్సిన భూమి (ఎకరాల్లో) |
|---|---|---|
| చిన్నకాళేశ్వరం | 183.96 | 818 |
| మోడికుంటవాగు | 163.08 | 75.51 |
| చనాక కొరాట | 147.23 | 760 |
| ఎల్లంపల్లి | 545.95 | 929.14 |
| దేవాదుల | 512.18 | 1544 |
| సీతారామ | 1487.31 | 2543 |
| కోయిల్‌సాగర్ | 121.56 | 285 |
| రాజీవ్‌భీమా | 127.34 | 183.28 |
| నెట్టెంపాడు | 67.88 | 480 |
| కల్వకుర్తి | 489.18 | 1395 |
| దిండి | 1887.1 | 4700 |
| ఎస్ఎల్‌బీసీ | 1679.66 | 864 |
| మొత్తం | 7647.09 | 14,696.26 |


# అన్యాయం జరిగితే మాకు చెప్పండి

**దళితులకు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాంచందర్ సూచన**



హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తేతెలంగాణ): తెలంగాణలో మార్చి నుంచి డిసెంబర్ వరకు తొమ్మిది నెలల్లో ఎస్సీలకు సంబంధించిన 64 కేసులను విచారించి పదకొండింటిని పరిష్కరించామని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడలోని దిల్‌కుశ గెస్ట్‌హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసు అధికారుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేశామని పేర్కొన్నారు. ఆయన భార్యకు వరంగల్‌లో ఉద్యోగం, రూ. 8.25 లక్షల నష్టపరిహారం, తల్లికి ప్రతినెలా రూ.5000 పింఛన్, పిల్లలకు కార్పొరేట్ విద్య అందించాలని డీజీపీ, అదనపు డీజీపీలను ఆదేశించామని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన ఎస్సీ కమిషన్‌కు సివిల్‌కోర్టు అధికారాలు ఉంటాయని చెప్పారు. భూకబ్జాలు, లైంగికదాడులు, హత్యలు తదితర విషయాల్లో అన్యాయానికి గురైన దళితులు జాతీయ ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకువస్తే విచారించి పరిష్కరిస్తామని వెల్లడించారు.

## లోకం పోకడ




స్విచ్చు వేస్తే కరెంటు వస్తలేదు గానీ, ఏదో సౌండ్ వస్తున్నది చూడు!

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 15.7°c | 30.3°c |
| మహబూబ్‌నగర్ | 17.0°c | 28.0°c |
| ఖమ్మం | 17.0°c | 30.0°c |
| హైదరాబాద్ | 18.0°c | 29.0°c |
| రంగారెడ్డి | 18.6°c | 30.2°c |
| వరంగల్ | 19.0°c | 28.0°c |
| కరీంనగర్ | 19.0°c | 28.0°c |
| నల్లగొండ | 19.4°c | 29.0°c |
| మెదక్ | 19.9°c | 29.9°c |
| నిజామాబాద్ | 21.8°c | 30.4°c |

## అన్నారం బరాజ్‌కు పుణె నిపుణుల బృందం

**సోమవారం నుంచి బరాజ్‌లో పరీక్షలు**

మహదేవపూర్(కాళేశ్వరం),డిసెంబర్ 27: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన అన్నారం బరాజ్‌లో పలు పరీక్షలు నిర్వహించేందుకు పుణెకు చెందిన నిపుణుల బృందం శుక్రవారం బరాజ్‌కు చేరుకుంది. ఇరిగేషన్ అధికారులతో కలిసి పూర్తిస్థాయిలో పరిశీలించి, సాంకేతిక అంశాలపై చర్చించారు. పలురకాల పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం నుంచి పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## ఏపీ వాదనలు అర్థరహితం

- సెక్షన్ 3 తరువాతే సెక్షన్ 89 విచారణ
- ట్రిబ్యునల్‌లో తెలంగాణ అఫిడవిట్

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం ముందుగా విచారణ పూర్తిచేయాలని ఏపీ చేస్తున్న వాదనలు అర్థరహితమని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. కృష్ణా ట్రిబ్యునల్ ఎదుట ఇటీవల ఏపీ దాఖలు చేసిన అఫిడవిట్‌పై తెలంగాణ ప్రభుత్వం తాజాగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. తెలంగాణ అభ్యర్థన మేరకు అంతర్రాష్ట్ర నదీజలాల చట్టం-1956, సెక్షన్ 3 ప్రకారం ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణాజలాల పంపిణీ చేపట్టాలని ట్రిబ్యునల్‌కు కేంద్ర జల్‌శక్తిశాఖ గతంలోనే మార్గదర్శకాలు జారీ చేసింది. దీనిని ఏపీ వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మరోవైపు సెక్షన్ 3 ప్రకారం విచారణ ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ విచారణ ముమ్మరం చేశారు. సెక్షన్ 3 అంశం ప్రస్తుతం కోర్టులో ఉందని, తొలుత సెక్షన్ 89 ప్రకారం విచారణ పూర్తిచేయాలని ఏపీ అఫిడవిట్ దాఖలు చేసింది. దీనిపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సెక్షన్ 89 కేవలం ప్రాజెక్టుల వారీగా మాత్రమే జలాలను కేటాయించాలని నిర్దేశిస్తున్నదని తెలంగాణ తెలిపింది. రెండు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల కేటాయింపులే లేవని వివరించింది.

## ఏపీలో భూముల మార్కెట్ ధరలు పెంపు!

**రిజిస్ట్రేషన్ల కోసం పరుగులు పెడుతున్న ప్రజలు**

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తేతెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో భూముల మార్కెట్ ధరలు పెరుగుతాయని జోరుగా ప్రచారం జరుగుతున్నది. దీంతో శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రజలతో కిటకిటలాడాయి. భూముల మార్కెట్ రేట్ పెరిగితే రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా పెరుగుతాయనే కారణంతో ప్రజలు రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి పరుగులు పెడుతున్నారు. ఈ నెల 30న సీసీఎల్ఏలో కీలక సమావేశం జరగనున్నది. భూముల మార్కెట్ ధర పెంపుపై ఈ సమావేశంలో చర్చించే అవకాశమున్నది.

## ఎస్సీ వర్గీకరణను అడ్డుకుందాం

**మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల పిలుపు**

పెంచికల్‌పేట్, డిసెంబర్ 27 : కేంద్రం రాజకీయ లబ్ధికోసం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని చూస్తున్నదని, మాలలంతా ఒక్కటై వర్గీకరణను అడ్డుకుందామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెంచికల్‌పేట్, కొండపల్లిలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ జెండా మహోత్సవంలో పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే విద్య, ఉద్యోగావకాశాలు కోల్పోతామని చెప్పారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలతో భావితరాలకు బాటలు వేసుకోవడమే లక్ష్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.